క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మన్ననూర్: పదర మండలం రాయలగండిలోని కస్తుర్బాగాంధీ పాఠశాల/కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు గెస్టు లెక్చరర్ల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఎస్‌ఓ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది కొత్తగా పాఠశాలలో అప్‌గ్రేడ్ చేసి ఏర్పాటు చేసిన సీఈసీ ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలు బోధించుటకు, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీ సాయింత్రం 5:00 గంటల వరకు గడువు ఉందని వివరించారు.

చెక్కుల పంపిణీ

పెంట్లవెల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు తహసీల్దార్ జయసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ పంపిణీ చేశారు. ఎర్రశ్రీను, వెంకటయ్య పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 167 కల్వకుర్తి జాతీయ రహదారి నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న పెద్ద, పెద్ద చెట్లను శుక్రవారం తొలగించారు. ప్రస్తుతం బస్టాండ్‌లో చెట్ల తొలగింపు వలన ప్రయాణికులకు నిల్వ నీడ లేకుండా పోయింది. కొల్లాపూర్–నాగర్‌కర్నూల్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం రెండు వైపులా బస్‌షెల్టర్లను చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పాత పోలీస్ స్టేషన్ ఎదుట 60 సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఈ నెల 9న తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్‌కు శుక్రవారం ఆర్యవైశ్యులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీమేష్, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు కిశోర్‌కుమార్, లక్ష్మణ్‌శెట్టి, రాజశేఖర్, శ్యాంసుందర్, శ్రీనివాసులు, యాదగిరి, నవీన్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన రైతు అల్లం హరీష్‌కు రూ.60 వేలు మంజూరయ్యాయి. శుక్రవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు ఫక్రుద్దీన్ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో చెక్కు మంజూరైందని ఆయన తెలిపారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి



తాడూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. మండలంలోని గుట్టలపల్లిలో మోడల్ గ్రామంగా ఎంపిక చేసి 12 ఇళ్లను మంజూరు అయ్యాయన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు

కొల్లాపూర్: ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాదారులు నిబంధనలు ఉల్లంఘించొద్దని ఏఓ చిన్న హుస్సేన్ యాదవ్ సూచించారు. పట్టణంలోని విత్తనాల దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. నిల్వలు, విక్రయాల రికార్డులను ఆయన పరిశీలించారు. అమ్మిన విత్తనాలు, స్టాక్ బుక్ మెయింటెన్స్ వివరాలను సరిచూశారు. ఇన్వాయిస్, బిల్‌బుక్‌లను సక్రమంగా మెయింటనెన్స్ చేయాలని, రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, స్టాక్ బోర్డులో వివరాలను రెగ్యులర్‌గా అప్‌డేట్ చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఏఈఓలు ఉన్నారు.





తెలకపల్లిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



కల్వకుర్తి మండలం ఎల్లికల్‌లో చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న అధికారులు



అచ్చంపేట మండలం లక్ష్మాపూర్‌లో..

సామూహిక అక్షరాభ్యాసం

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కల్వకుర్తి మండలం ఎల్లికల్ ప్రాథమిక పాఠశాల, అచ్చంపేట మండలంలోని లక్ష్మాపూర్, తాడూరు మండలంలోని యాత్మతాపూర్, వెల్దండ, తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ, ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలను దిద్దించారు. పలు పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తాడూరు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తెలకపల్లి ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎంలు జమీల్ అహ్మద్, పావని, శ్రీనివాసులు, ఉప్పునుంతన పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వెల్దండలో విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



తాడూరులో..



తిమ్మాజిపేట మండలం గుమ్మకొండలో..



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ

వెల్దండ: మండలంలోని గుండాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శుక్రవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు మొత్తం 425 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. విడతల వారిగా మొత్తం రూ.5 లక్షల బిల్లులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పల్లవి, కాంగ్రెస్ నాయకులు పర్వత్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

మమ్మాయిపల్లిలో

బిజినేపల్లి: మండలంలోని మమ్మాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు పంచాయతీ కార్యదర్శి సురేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బన్నయ్య, మైబూస్ భూమి పూజ ప్రారంభించారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కదిరె రాము గ్రామస్తులు ఉన్నారు.

చారకొండలో..

చారకొండ: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ ప్రారంభించారు. ఇంటి నిర్మాణాలనికి మార్కు చేసి ముగ్గు పోశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్, మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, లక్ష్మణ్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.



వెల్దండ మండలం గుండాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు

పెంట్లవెల్లిలో జోరువాన



పెంట్లవెల్లి: మండలంలో రెండు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు రోడ్లపై పారుతోంది. డ్రెయినేజీ కాల్వలు నిండి వీధుల్లో ప్రవహిస్తోంది. మంచాలకట్ట, మాధవస్వామి, మల్లేశ్వరం, కొండూరు గ్రామాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. వర్షానికి రోడ్లపై భారీగా నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

జాతీయ ప్రతిభా నిధి పరీక్షకు ఎంపిక

కల్వకుర్తి రూరల్: పట్టణంతోపాటు మండలంలోని తాండ్ర ఉన్నత పాఠశాల చెందిన ఆరు మంది విద్యార్థులు జాతీయ ప్రతిభా నిధి పరీక్షకు శుక్రవారం ఎంపికయ్యారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల చెందిన యాస్మిన్ బేగం, వడల నికిత, సంగిశెట్టి ప్రశాంతి, బండి పూజ, కొమ్ము యామిని తాండ్ర పాఠశాల చెందిన జగదీశ్వర్లు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి నాలుగు సంవత్సరాల పాటు ఒక్కో ఏడాది రూ.48 వేలు స్కాలర్‌షిప్ పొందనున్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

బిజినేపల్లి : మండలంలోని వట్టెంకు చెందిన మహేశ్, శిరీష దంపతులకు చెందిన వైష్ణవి (5) అనే చిన్నారి నీటిసంపులో పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. పాలెంలో ఇంటి నిర్మాణ పని ప్రదేశం వద్దకు వైష్ణవిని తల్లితండ్రులు తీసుకెళ్లారు. అక్కడ వారు పని చేస్తుండగా ప్రమాదశావత్తు చిన్నారి నీటిసంపులో పడిపోయింది. కాసేపటికే విషయం గమనించిన తల్లితండ్రులు పాపను నీటి నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందడంతో కుటుంబ శోకసంద్రంలో మునిగింది.

బియ్యం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లిలో మూడు రోజుల కిందట గ్రామానికి చెందిన అర్కంటి ఎల్లమ్మ, అర్కంటి బోందయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను శుక్రవారం సత్యహరిశ్చంద్ర ఫౌండేషన్ చైర్మన్ నకినమోని రాములు యాదవ్ పరామర్శించి 50 కేజీల చొప్పున బియ్యం వితరణ చేశారు.



డీఈఓ ఆకస్మిక తనిఖీ



వెల్దండ: మండలంలోని కొట్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను డీఈఓ రమేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల గణిత, ఆంగ్ల సబ్జెక్టుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి తరగతిలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు, హెచ్‌ఎం ప్రేమకుమారి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

రూ.10 లక్షలు వితరణ



పెద్దకొత్తపల్లి: మండలంలోని వెన్నచర్లలో శివాలయం నిర్మాణం కోసం మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ రూ. 10 లక్షలు వితరణ చేశారు. శుక్రవారం ఆలయ నిర్మాణ కర్త రామాచారికి అందజేశారు. ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలన్నారు. నాయకులు బాలస్వామి, రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, రాముడు, నాగరాజు పాల్గొన్నారు.

విద్యామండలి చైర్మన్‌కు సన్మానం

కందనూలు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాస రాఘవేందర్, మాజీ అధ్యక్షుడు రాజయ్య, రాజశేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే ఆర్థిక వృద్ధి

కందనూలు/అచ్చంపేట రూరల్/చారకొండ/వెల్దండ: బీజేపీతోనే దేశ ఆర్థికవృద్ధి మెరుగైందని బీజేపీ సీనియర్ నాయకుడు నాగేంద్రగౌడ్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ మండలం పుల్జాలలో బీజేపీ మండల స్థాయి సంకల్ప సభ మండల అధ్యక్షుడు సోమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగేంద్రగౌడ్ హాజరయ్యారు. ముందుగా అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం నాగేంద్రగౌడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. ఆపరేషన్ సిందూర్‌పేరుతో ఉగ్రవాదులను చంపి దేశం సత్తా చూపించారన్నారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద దేశంలో 81 కోట్ల మందికి ఐదు కిలోల ఉచిత రేషన్ బియ్యం ఇస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పోల్దాసు రాము, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీశైలం, మండల ప్రభారి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు గోపాల బాల మల్లయ్య, కొమ్ము సత్యనారాయణ, ఆఫీసు ఇన్‌చార్జి చందు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

■ అచ్చంపేట పట్టణంలోని పలు వార్డులలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గండు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులలో బీజేపీ రాష్ట్ర నాయకులు మంగ్యానాయక్, బాలాజీ పర్యటించారు. మురుగు కాల్వలు, సీసీరోడ్లు దెబ్బతినడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో, ఉప్పునుంతల రోడ్డులో మురుగు కాల్వ బ్రిడ్జి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. శ్రీనివాస్‌గౌడ్, రవీందర్, చందులాల్, శివచంద్ర, రాజు, మధు, అమర్ తదితరులు పాల్గొన్నారు.

■ చారకొండ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కృష్ణ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి హాజరయ్యారు. మండలంలోని పార్టీ బలోపేతం తదితర వాటిపై కార్యచరణ రూపొందించారు. 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వేణుశర్మ, హరిబాబు,కొండల్, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, వెంకట్ గౌడ్, చంద్రారెడ్డి, రామకృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

■ వెల్దండ మండల కేంద్రంలో ఆకృతి గార్డెన్‌లో బీజేపీ నాయకులు వికసిత్ భారత్‌కా అమృత్ కాల్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బీజేపీ జెండాను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. బండెల రామచంద్రారెడ్డి, కుర్మిద్ద యాదగిరి, జంగయ్య యాదవ్, శ్రీనివాసచారి, రాజేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జంగయ్య, శ్రీశైలం ముదిరాజ్, శశిదర్‌రెడ్డి, శ్రీకాంత్, ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



చారకొండ సమావేశంలో బీజేపీ నాయకులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం

బల్మూర్: పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రవేశ పెట్టిన 'ఎగ్ బిర్యాని' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి గుడ్డు బిర్యాని కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమాధికారి రాజ్యలక్ష్మి, సీడీపీఓ దమయంతి, ఎంపీడీఓ రాఘవులు, ఎంఈఓ విష్ణుమూర్తి, సీఐ నాగరాజు, ఎస్‌ఐ రాజేందర్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కాశన్నయాదవ్, ఖదీర్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎగ్ బిర్యాని అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమస్యల పరిష్కారం కోసం సదస్సులు

కల్వకుర్తిరూరల్/తాడూరు/పెద్దకొత్తపల్లి/ఉప్పునుంతల: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ శ్రీను నాయక్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి మండలంలోని తర్నికల్‌లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. తర్నికల్ గ్రామంలో 87, కల్వకుర్తి పట్టణంలో 49 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ఇబ్రహీం తెలిపారు. డీటీలు అనిత, కల్మచర్ల రాఘవేందర్, ఆర్ ఐ లుర వూఫ్, రోహిత్ రెడ్డి, నవీన్, శేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

■ తాడూరు మండలంలోని బలాన్‌పల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ జయంతి, డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ అలీ దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 20 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

■ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతో పాటు గంట్రావుపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మండల కేంద్రంలో 34 దరఖాస్తులు, గంట్రావుపల్లిలో 50 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీ రమేష్‌నాయక్, సిబ్బంది శివకృష్ణ, రమేష్, శివకుమార్, ప్రసన్న, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, చిన్నయ్య, మాజీ ఎంపీటీసీలు దీపిక, లక్ష్మణ్‌రావులు పాల్గొన్నారు.

■ ఉప్పునుంతల మండలంలోని అయ్యవారిపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అయ్యవారిపల్లి సదస్సులో తహసీల్దార్ ప్రమీల, దాసర్లపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ పరశునాయక్ బృందాలు పాల్గొన్నాయి. ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై రైతుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. రైతులకు రసీదులు అందజేశారు.



కల్వకుర్తిలో దరఖాస్తు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీను నాయక్

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నగర కార్యదర్శి వంశీ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఎంఈఓ శంకర్ నాయక్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్, ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ల అందజేత



కల్వకుర్తి రూరల్/వెల్దండ: కల్వకుర్తి మండలం సుద్దకల్, వెల్దండ మండల కేంద్రంలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ సమకూర్చి మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కల్వకుర్తిలో మాజీ సర్పంచ్ రాంరెడ్డి, వెల్దండలో మాజీ ఉప సర్పంచ్ నిరంజన్ అందజేశారు. ఆంజనేయులు, కాశన్న, చంద్రశేఖర్, సిద్దగోని రమేష్‌గౌడు, పూరి రమేష్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు

మన్ననూర్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు ఉంటాయని హెచ్‌ఎం విజయ్ మోహన్ అన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాలు మాధవానిపల్లి, వంగురోనిపల్లి, ఈదులబావి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామ యువతతో కలిసి బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడిఈడు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా బోధన ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపించి డబ్బులు వృథా చేసుకోవద్దన్నారు. ఉపాధ్యాయులు ఎల్లయ్య, లాల్ సింగ్, శివలింగం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి



నాగర్‌కర్నూల్ రూరల్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగానికి అప్పగించేందుకు చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శివ శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును బీమా కంపెనీలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. టెండర్లు వెంటనే రద్దు చేయకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వెంకట్, స్వామి, సత్యం, మల్లేష్, వంశీ, సింగోటి, తదితరులు పాల్గొన్నారు.

మంజూరు పత్రాలు పంపిణీ

లింగాల: మండలంలోని వల్లభాపూర్, రాంపూర్, బాకారం, సూరాపూర్, మగ్దూంపూర్, కొత్తకుంటపల్లి, అప్పాయపల్లి, శ్రీరంగాపూర్, చెన్నంపల్లి, పద్మన్నపల్లి, క్యాంపు రాయవరం తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకులు బుడ్డయ్య, ముక్తార్, మల్లేష్‌యాదవ్, రాంబాబు, మల్లయ్య, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: అర్హులైన ప్రతి దళితుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణంలో ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారని అర్హులైన వారికి ఇవ్వడం లేదని ఆరోపించారు. దళితులు ఇప్పటికి గుడిసెలలో నివసిస్తున్నారన్నారు. పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లె రాజు ఆంజనేయులు, నాగరాజు, పరమేశ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు సరిపడ నీటిని అందించాలి



బిజినేపల్లిలో రైతులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న శాస్త్రవేత్త డా.నళిని

బిజినేపల్లి: పంటలకు సరిపడ సాగునీటిని అందించాలని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డా.నళిని అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్రకుంటతండా, ఉడుగులకుంటతండాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డా.నళిని మాట్లాడుతూ రైతులు బిందు సేద్యం, స్ప్రింక్లర్లు వంటి వాటిని ఉపయోగించి పంటలు సాగు చేయాలని సూచించారు. తద్వారా సాగునీటిని ఆదా చేయడమే కాకుండా కలుపు నివారణతో పాటు సులభంగా ఎరువులు కూడా సరఫరా చేయొచ్చన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఏఓ నీతి, ఆయా తండాల రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

కల్వకుర్తి రూరల్: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధ్యమని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త త్రివేణి అన్నారు. శుక్రవారం మండలంలోని మార్చాలలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. యూరియా, పురుగుమందులు వాడే విధానంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల, అధికారుల సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఏఈఓ రామచంద్రయ్య రైతులు పాల్గొన్నారు.